క్లుప్తంగా

వినూత్నంగా హిందీ దివస్



హిందీ ఆకారంలో కూర్చున్న విద్యార్థులు

నారాయణఖేడ్: ఖేడ్ మండలం అంత్వార్ శివారులోని బోధి పాఠశాలలో సోమవారం ప్రపంచ హిందీ దివస్‌ను ఘనంగా నిర్వహించారు. ఆదివారం హిందీ దివస్ పాఠశాలకు సెలవు కావడంతో సోమవారం జరిపారు. విద్యార్థులు వినూత్నంగా హిందీ అక్షరాల ఆకారంలో కూర్చుని ఆకట్టుకున్నారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కరాటేలో ప్రతిభ



బెల్ట్, సర్టిఫికెట్ అందుకుంటున్న ఆనంద్‌కుమార్

జహీరాబాద్ టౌన్: కోహీర్‌కు చెందిన ఆనంద్ కుమార్ కరాటే టెస్టులో ప్రతిభ కనబరిచి గ్రీన్ బెల్ట్ సాధించాడు. సంగారెడ్డిలో నిర్వహించిన గ్రేడింగ్ పరీక్షలో ఉత్తీర్ణత సాధించాడు. సాంకేతికతలో మెరుగుదల ప్రదర్శన ఇచ్చినందుకు ఇంటర్నేషనల్ గ్రాండ్ మాస్టర్ సాజిద్ చేతుల మీదుగా గ్రీన్ బెల్ట్‌తో పాటు సర్టిఫికెట్ అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర క్రీడల శాఖ ప్రతినిధి డాక్టర్ వేణు, శిక్షకులు శ్రీధర్ పాల్గొన్నారు.

ఉచిత పశు వైద్య శిబిరం



పశువులకు చికిత్సలు చేస్తున్న డాక్టర్ గణేశ్

న్యాల్‌కల్(జహీరాబాద్): మండలంలోని గంగ్వార్‌లో మంగళవారం ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. ఉదయం మహీంద్రా అండ్ మహీంద్రా కంపెనీ వారి సహకారంతో నిర్వహించిన వైద్య శిబిరంలో వైద్యుడు గణేశ్ పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. పశువుల ఆరోగ్యం, సంతానోత్పత్తికి సంబంధించి పరీక్షలు చేసి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, మహీంద్రా అండ్ మహీంద్రా కంపెనీ వారు పాల్గొన్నారు.

ఒవైసీని కలిసిన నేతలు



అసదుద్దీన్‌తో జహీరాబాద్ కార్యకర్తలు

జహీరాబాద్ టౌన్: మజ్లీస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు, ఎంపీ.అసదుద్దీన్ ఒవైసీని హైదరాబాద్‌లో జహీరాబాద్ నాయకులు కలిశారు. జహీరాబాద్ అధ్యక్షుడు అక్తర్ అహ్మద్, నాయకులు మోహియోద్దీన్ ఘోరీ, ఆమెర్‌బిన్ అబ్దుల్లా, అక్బర్ తదితరులు ఉన్నారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఈ సందర్భంగా ఎంపీ వారికి సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేస్తే పార్టీ బలపడుతుందని నాయకులు ఒవైసీకి సూచించారు.

రేకుల షెడ్ల పనుల పరిశీలన



పనులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ హరినందన్‌రావు

మునిపల్లి(అందోల్): విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా సత్వరమే పనులు పూర్తి చేయాలని ఎంపీడీఓ హరినందన్‌రావు సంబంధిత కాంట్రాక్టర్‌కు సూచించారు. సోమవారం మండలంలోని లింగంపల్లి గురుకుల పాఠశాల హాస్టల్ విద్యార్థులు ఉండడానికి ఏర్పాట్లు చేస్తున్న పనులు పరిశీలించారు. దసరా సెలవులలో పనులు పూర్తి చేయాలన్నారు. దసరా సెలవులు పూర్తి కాగానే విద్యార్థులు తాత్కాలికంగా ఉండడానికి ఏర్పాటు చేస్తున్న రేకుల షెడ్ల పనులు పూర్తి చేయాలని తెలిపారు.

దొంగతనాలు అరికట్టాలి

సంగారెడ్డి టౌన్ : పంట పొలాల్లో సోలార్ ప్లానెట్లు, బోరు వైర్లు వివిధ వస్తువులను దొంగతనాలను చేస్తున్నారని మండలంలోని ఇరిగిపల్లి, చింతలపల్లి గ్రామస్తులు సోమవారం సంగారెడ్డి రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గ్రామస్తులు కథనం ప్రకారం.. పంట పొలాల్లో వినియోగించే బోరు మోటార్లు, కరెంటు వైర్లు, అల్యూమినియం వంటి వస్తువులను దొంగతనాలు చేస్తున్నారని వాటి విలువ ఒక్కొక్కటి రూ.15 నుంచి 20 వేల వరకు ఉంటుందని గ్రామస్తుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లిన పట్టించుకోవడం లేదని వాపోయారు. పోలీసు అధికారులు స్పందించి దొంగలను పట్టుకోవాలని కోరారు.

గ్రామీణ రోడ్లు గుంతలమయం



ఎడ్లరేగడితండా వద్ద రోడ్డుపై గుంతల్లో నిలిచిన వర్షపు నీరు



తడ్కల్ వద్ద గుంతలమయంగా ఆర్అండ్‌బీ రోడ్డు

ప్రయాణానికి జంకుతున్న ప్రజలు

- తరుచూ ప్రమాదాల బారిన పడుతున్న స్థానికులు
- పట్టించుకోని అధికారులు

కంగ్టి(నారాయణఖేడ్): మండలంలోని గ్రామీణ ప్రాంత రోడ్లు గుంతలమయంగా మారాయి. అటు పంచాయతీరాజ్ శాఖ రోడ్లు, ఇటు ఆర్అండ్‌బీ రోడ్లపై ప్రయాణం చేయాలంటే స్థానికులు జంకుతున్నారు. నెల రోజులుగా కురుస్తున్నా వర్షాలకు పరిస్థితి మరీ అధ్వానంగా మారింది. గుంతల లోతు తెలియక ద్విచక్ర వాహనదారులు పడి ప్రమాదాలకు గురవుతున్నారు. కంగ్టి మండలంలోని తడ్కల్ నుంచి నల్లవాగు(సుల్తానాబాద్) వెళ్లే రోడ్డు ఆర్అండ్‌బీ ఆధీనంలో ఉంది. తడ్కల్ నుంచి ఎడ్లరేగడితండా వెళ్లే పంచాయతీరాజ్ రోడ్డు అడుగడుగునా గుంతల్లో నీరు నిండడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి నూతనంగా రోడ్లు వేయించి రవాణా కష్టాలు తొలగించాలని తడ్కల్ పరిసర గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

వేతనాలు చెల్లించాలని ధర్నా



భగీరథ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు

నారాయణఖేడ్: మిషన్ భగీరథ కార్మికులకు వేతనాలు పెంచుతూ.. ఇతర కార్మికులకు పెంచకుండా వివక్ష చూపడం ఏంటని డిమాండ్ చేస్తూ ఖేడ్‌లోని భగీరథ పథకం కార్యాలయం ఎదుట సోమ వారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ఉప ప్రధాన కార్యదర్శి చిరంజీవి మాట్లాడుతూ.. నాగల్‌గిద్ద మండలంలో పనిచేస్తున్న మిషన్ భగీరథ పథకం కార్మికులకు వేతనాలు పెంచడంలో అధికారుల, కాంట్రాక్టర్ నిర్లక్ష్యం కనిపిస్తుందన్నారు. ఒకే సంస్థలో పని చేస్తున్నా వారికి రూ.12వేలు, మరో కంపెనీ రూ.9వేలు చెల్లించడం ఏమిటని ప్రశ్నించారు. కనీస వేతనం రూ.26వేలు చెల్లిస్తూ ఈఎస్‌ఐ, పీఎఫ్ సదుపాయాలు, ఉద్యోగ భద్రత, ప్రమాద బీమా సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. వేతనాలు పెంచని పక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. మిషన్ భగీరథ కార్మికులు శివరాజ్, అశోక్, కాశీనాథ్, శంకరప్ప, మల్లికార్జున్, మోహన్ పాల్గొన్నారు.

పోషకాహార ప్రాధాన్యం వివరించాలి

జిల్లా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్



సమీక్షలో మాట్లాడుతున్న చంద్రశేఖర్

సంగారెడ్డి జోన్: పోషకాహార ప్రాధాన్యంపై గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అవగాహన సదస్సులు నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే ఎనిమిదవ జాతీయ పోషణ అభియాన్ మాసం గోడపత్రికను ఆవిష్కరించి, వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. ఆరోగ్యవంతమైన సమాజం నిర్మాణం కోసం పోషణ్ అభియాన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని విద్యార్థులకు రక్తహీనతతో పాటు ఇతర సమస్యలు ఉంటే స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించి అవసరమైన చికిత్సలు అందించాలన్నారు. అన్ని శాఖల అధికారుల సమన్వయంతో కార్యక్రమం విజయవంతం చేయాలని సూచించారు. జిల్లా సంక్షేమ అధికారి లలితకుమారి, వైద్యాధికారి నాగనిర్మల, జిల్లా పంచాయతీ అధికారి సాయిబాబా, జిల్లా పరిషత్ సీఈఓ జానకిరెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులకు 'వాల్యూ ఎడ్యుకేషన్' క్లాస్



కంప్యూటర్ స్క్రీన్ ద్వారా బోధన వింటున్న విద్యార్థులు

రాయికోడ్(అందోల్): రాయికోడ్‌లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 3,4,5 తరగతుల విద్యార్థులు సోమవారం 'వాల్యూ ఎడ్యుకేషన్' తరగతులు విన్నారు. పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో కంప్యూటర్ స్క్రీన్‌లో ఉన్నతాధికారులు, మోటివేషన్ నిపుణులు నాణ్యమైన విద్య–నైతిక విలువలు అనే అంశంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా హెచ్ఎం శ్రీనివాస్ మాట్లాడుతూ.. వాల్యూ ఎడ్యుకేషన్ తరగతులతో పిల్లల్లో నైతిక విలువలు పెరుగుతాయని అభిప్రాయపడ్డారు. తల్లిదండ్రులు తమ పిల్లలను సెల్‌ఫోన్‌లకు దూరంగా ఉంచేందుకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శోభ, తులసి, పాఠశాల సిబ్బంది ఉన్నారు.

నేడు న్యాల్‌కల్‌లో ప్రజాదర్బార్

న్యాల్‌కల్(జహీరాబాద్): 2024–2025 సంవత్సరానికి ఉపాధిహామీ పథకంలో చేపట్టిన పనులకు సంబంధించి మంగళవారం స్థానిక ఎంపీపీ కార్యాలయం ఆవరణలో ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాస్, ఏపీఓ రంగారావు తెలిపారు. ఉ.10 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమానికి ఏపీడీ బాలరాజ్ తదితరులు హాజరవుతారని చెప్పారు. అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బంది హాజరు కావాలని కోరారు.

నేడు డయల్ యువర్ డీఎం

జహీరాబాద్ టౌన్: ఆర్టీసీ డిపోలో ఈ నెల 16న డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మేనేజర్ టి.స్వామి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉ.10 గంటల నుంచి 11 గంటల వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. ఆర్టీసీకి సంబంధించిన సందేహాలు, సలహాలు, సూచనలకు 9959226269 నంబర్‌కు ఫోన్ ద్వారా తెలియజేయాలని కోరారు.

రక్షణ చట్టం కోసం దీక్ష

సంగారెడ్డి టౌన్ : రాష్ట్రంలో న్యాయవాదులపై దాడులకు నిరసనగా న్యాయవాదుల రక్షణ చట్టం కోసం 48గంటల దీక్ష చేపట్టనున్నట్లు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు విష్ణువర్ధన్ రెడ్డి అన్నారు. సోమవారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. మొట్టమొదటి సారిగా న్యాయవాదుల రక్షణ కోసం 48గంటల దీక్ష చేపడుతున్నామని పేర్కొన్నారు. ప్రభుత్వాలు వెంటనే న్యాయవాదుల రక్షణ చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

ఆసరా పింఛన్లు పెంచండి



ధర్నా చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

కంది(సంగారెడ్డి): కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీని అమలు చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకురాలు పెద్ద గీతామాదిగ డిమాండ్ చేశారు. సోమవారం ఆసరా పింఛన్లను పెంచాలని డిమాండ్ చేస్తూ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో కంది తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు వృద్ధులు, వికలాంగులు వితంతువులు, ఒంటరి మహిళలకు ఆసరా పింఛన్లను పెంచుతామని ఇచ్చిన హామీని అమలు చేయడం లేదని మండిపడ్డారు. అనంతరం తహసీల్దార్ రవికుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఎమ్మార్పీఎస్ మండల నాయకులు పెంటయ్య, నర్సింలు కార్యకర్తలు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ 16 మందికి జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుపడిన వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమాన విధించింది. పటాన్‌చెరు ట్రాఫిక్ సీఐ లాలూ నాయక్ వివరాల ప్రకారం.. ఆదివారం నిర్వహించిన తనిఖీల్లో 16 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారిని సోమవారం హాజరు పర్చగా 15 మందికి ఒక్కొక్కరికి రూ.వెయ్యి చొప్పున , మరో వ్యక్తికి రూ.1500 జరిమానా విధించినట్లు తెలిపారు.

◆ సాఫ్ట్‌వేర్ కుటుంబంపై దాడి

పటాన్‌చెరు టౌన్: సాఫ్ట్‌వేర్ ఉద్యోగి, అతడి తల్లిదండ్రులపై వారి బంధువులు దాడికి దిగిన ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ మహేశ్వర్ రెడ్డి వివరాల ప్రకారం.. ఇంద్రేశం గ్రామం నవ్య తులసి గార్డెన్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి సాయి చరణ్‌కు తిరుపతికి చెందిన తేజశ్రీతో వివాహమైంది. పెళ్లయిన నాటి నుంచి వేరు కాపురం ఉందామని భార్య భర్తతో గొడవపడేది. ఈ క్రమంలో ఈ నెల 11న భర్తతో గొడవపడి కూకట్‌పల్లిలో ఉంటున్న పెదనాన్న ఇంటికి వెళ్లింది. రెండు రోజుల తర్వాత భార్య పెద్దమ్మ, అమ్మ మరి కొంత మందితో కలిసి వచ్చి మా అమ్మాయి ఎక్కడ అంటూ సాయి చరణ్‌పై, అతడి తల్లిదండ్రులపై దాడి చేశారు. దీంతో సాయి చరణ్ తమపై హత్యాయత్నం చేశారని పోలీసులకు ఫిర్యాదు చేశారు.

◆ సేవా గుణం కలిగి ఉండాలి

జహీరాబాద్ టౌన్: చదువుతో పాటు సేవాగుణం కల్గిండాలని సామాజిక సేవకులు, కవి, రచయిత పెద్ద గొల్లనారాయణ అన్నారు. మండలంలోని అల్గోల్ గ్రామంలో ఆచార్య డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ 3 ఆధ్వర్యంలో వలంటీర్లు ప్రత్యేక శీతాకాలం శిబిరం ఏర్పాటు చేశారు. శ్రమదానం వల్ల సేవాదృక్పథం అలవడుతుందన్నారు.

◆ ఏఈ మౌనికకు సన్మానం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ఇంజనీర్‌ల దినోత్సవం సందర్భంగా సోమవారం తెల్లాపూర్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మున్సిపల్ ఏఈ మౌనికను ఘనంగా సన్మానించారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు రమణ మాట్లాడుతూ.. తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలో క్లబ్ ఆధ్వర్యంలో పలు సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

◆ సకాలంలో పన్ను చెల్లించండి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని ప్రజలు సకాలంలో ఇంటిపన్నులు చెల్లించి మున్సిపల్ అభివృద్ధికి కృషి చేయాలని మున్సిపల్ మేనేజర్ అఖిల్ కోరారు. సోమవారం ఇంటిపన్నులపై బిల్ కలెక్టర్‌లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు.

◆ చరిత్రను వక్రీకరించడం తగదు



సదాశివపేట(సంగారెడ్డి): తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటాన్ని వక్రీకరించడం ప్రజల మధ్య మత విద్వేషాలు రెచ్చగొట్టడం కోసం బీజేపీ ప్రచారం చేయడం దుర్మార్గమని సీపీఎం ఏరియా కార్యదర్శి ప్రవీణ్‌కుమార్ పేర్కొన్నారు. సోమవారం సీపీఎం పార్టీ కార్యాలయంలో వీర తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వార్షికోత్సవ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిజాం నవాబుకు వ్యతిరేకంగా భూమి, భుక్తి, వెట్టిచాకిరీ నుంచి విముక్తి కోసం ఎర్రజెండా పార్టీ నాయకత్వంలో పోరాటం జరిగిందన్నారు. పోరాటంలో 4500 మంది పార్టీ కార్యకర్తలు వీర మరణం పొందారని తెలిపారు. పది లక్షల ఎకరాల భూమిని ప్రజలకు పంచిన ఘనత కమ్యూనిస్టు పార్టీలదన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు అనిల్, భూషణం, శ్రీకాంత్, మోహన్, మల్లేశం, దశరథ్, శేఖర్, సంజీవులు పాల్గొన్నారు

పామాయిల్ సాగుకు నిరంతరం నీరు

- శాస్త్రవేత్తలు డా.నిర్మల, డా.అరుణ
- తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో శిక్షణ



రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

జోగిపేట(అందోల్): జోగిపేట- అందోల్ మున్సిపాలిటీ పరిధిలోని కొట్టాలలో పామాయిల్ సాగు యాజమాన్యంపై తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం(టీఆర్‌వికే) సంగుపేట ఆధ్వర్యంలో శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. శాస్త్రవేత్తలు డా.ఏ.నిర్మల, డా.కే.అరుణ మాట్లాడుతూ.. పామాయిల్ పంటకు సంవత్సరమంతా వర్షపాతం కలిగి సాగునీరు నిరంతరం లభ్యమయ్యే ప్రాంతాల్లో మాత్రమే పామాయిల్ సాగు చేయాలని సూచించారు. సాగుకు టెనేరా అనే హైబ్రిడ్ అనుకూలం ఇది పలుచని పెంకు కలిగి ఎక్కువ నూనెశాతం కలిగి ఉంటుందన్నారు. మొక్కల ఎంపిక 12–14 నెలల వయస్సు కలిగి, 1.0- 1.2 మీ.ఎత్తు, 12 ఆకులు, 20–25 సెంటీమీటర్ల మొక్క మొదలు చుట్టుకొలత ఉన్న మొక్కలను ఎంచుకోవాలి. జూన్ నుంచి డిసెంబర్ మధ్య మొక్కలను నాటుకోవచ్చునని తెలిపారు. ఎక్కువ దిగుబడి కోసం సమృద్ధిగా సాగు నీరు అవసరమని 3 సంవత్సరాల పైబడిన చెట్లకు ప్రతిరోజు 200 లీటర్ల నుంచి 250 లీటర్ల నీరు అందించాలన్నారు. ఎత్తు పల్లాలు కలిగిన భూములను డ్రిప్ ద్వారా లేదా మైక్రోస్ప్రింకర్ల ద్వారా అందించడం వల్ల లాభదాయకంగా ఉంటుందని రైతులకు సూచించారు. మంచి దిగుబడికి సమతుల్యమైన, సమృద్ధి కార్యక్రమంలో గ్రామ రైతులు మాణయ్య, కిష్టయ్య, నర్సింలు, రాములు, నారాయణ, జనార్దన్, విట్టల్, వ్యవసాయ విద్యార్థులు, తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం యంగ్ ప్రొఫెషనల్ ఎస్.శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

టెక్నాలజీ లేని రోజుల్లో దేశానికి సేవలు

కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్



విశ్వేశ్వరయ్య జయంతి వేడుకల్లో కార్పొరేటర్, నాయకులు

పటాన్‌చెరు టౌన్: టెక్నాలజీ లేని రోజుల్లో దేశానికి ఇంజనీర్‌గా మోక్షగుండం విశ్వేశ్వరయ్య చేసిన సేవలు మరవలేనివని కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ అన్నారు. సోమవారం ఇంజనీర్స్ డేను పురస్కరించుకొని యువజన వికాస సమితి ఆధ్వర్యంలో పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. మైసూరులో కృష్ణరాజ ఆనకట్టకు ఆయన చీఫ్ ఇంజనీరుగా పనిచేశారని, హైదరాబాద్ మూసీనది వరదల నుంచి రక్షించడానికి ఆయనే పథకాలను రూపొందించారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు శంకర్, రఘు, అశోక్, పృథ్వీరాజ్, విజయ్‌కుమార్, సత్యనారాయణ, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

హిందువుల ఐక్యతే లక్ష్యంగా ముందుకు..



కార్యక్రమంలో మాట్లాడుతున్న ధనుంజయ

నారాయణఖేడ్: హిందువుల ఐక్యతే లక్ష్యంగా విశ్వ హిందూ పరిషత్ సామాజిక సమరసత అభియాన్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు విశ్వహిందూ పరిషత్ సామాజిక సమరసత అభియాన్ రాష్ట్ర కన్వీనర్ ధనుంజయ్ తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పూజ్య స్వామీజీల మార్గదర్శకంతో హిందువులు కులాలు, వర్గాలు, వర్ణాల పేరిట విడిపోరాదని కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. స్త్రీలను దేవతాస్వరూపులుగా చూస్తామన్నారు. మండల కేంద్రం కంగ్టిలోని బసవప్రదీప్ ఫంక్షన్‌హాల్‌లో ఈనెల 25న మండలంలోని 33 గ్రామాలకు చెందిన ఒక్కో గ్రామం నుంచి ఆరుగురి చొప్పున హరిజన, గిరిజన మాతృమూర్తులకు సుహాసిని పాదపూజతో పాటు బహిరంగ సభను నిర్వహించనున్నట్లు తెలిపారు. వీహెచ్‌పీ, బీజేపీ నాయకులు రజనీకాంత్, సాయిరాం, గంగారాం తదితరులు పాల్గొన్నారు.

యాత్రదానం పోస్టర్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే



పోస్టర్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

పటాన్‌చెరు: నిరుపేదలు, అనాథలు, నిరాశ్రయుల కోసం రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఆధ్వర్యంలో ప్రారంభించిన యాత్రదానం పోస్టర్‌ను ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి ఆవిష్కరించారు. సోమవారం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆర్టీసీ ఆధ్వర్యంలో పర్యాటక ప్రాంతాలు, పుణ్యక్షేత్రాలకు వెళ్లాలని, ఆర్థిక స్తోమత లేని అనాథలు, నిరాశ్రయులు, వృద్ధులు, దివ్యాంగులు, నిరుపేద విద్యార్థులను పంపించేలా ఎవరైనా దాతలు ముందుకు వస్తే యాత్రదానం కార్యక్రమం ద్వారా బస్సులు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. నియోజకవర్గ పరిధిలోని వివిధ అనాధాశ్రమాలు, వృద్ధాశ్రమాలు, నిరాశ్రయులను సైతం వివిధ పుణ్యక్షేత్రాలకు పంపించేందుకు సొంత నిధులు ఖర్చు చేసేందుకు తాను సిద్ధంగా ఉన్నట్లు పేర్కొన్నారు. త్వరలోనే సంబంధించిన వివరాలు తెలియజేస్తామని అధికారులకు చెప్పారు. బీహెచ్ఈఎల్ డిపో మేనేజర్ సుధా, సిబ్బంది పాల్గొన్నారు.

ముందుకు రావాలి

నారాయణఖేడ్: ఆర్థికంగా వెనుకబడిన పేదలు, వృద్ధులు, దివ్యాంగులు, విద్యార్థుల కోసం యాత్రాదానం చేయడానికి దాతలు ముందుకు రావాలని డీఎం మల్లేశయ్య కోరారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఆర్టీసీ సంస్థ ఆదాయాన్ని పెంచుకునే చర్యల్లో భాగంగా టూర్ ప్యాకేజీలు, యాత్రాదానం అమలు చేస్తోందన్నారు.

పంట నష్టపోయిన రైతులను ఆదుకోండి



ఉమాహారతికి వినతిపత్రం అందజేస్తున్న భూపాల్‌రెడ్డి

నారాయణఖేడ్: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పంటలు నష్టపోయిన నియోజకవర్గంలోని మనూరు, నాగలిద్ద మండలాల రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి కోరారు. సోమవారం సబ్ కలెక్టర్ ఉమాహారతికి వినతిపత్రం అందించారు. ఈ రెండు మండలాల్లో సింగూరు బ్యాక్ వాటర్ వల్ల అధికశాతం భూములు ముంపునకు గురయ్యాయని అన్నారు. వరి, సోయాబీన్, పత్తి, మినుము, పెసర పంటలకు భారీగా నష్టం వాటిల్లిందన్నారు. ప్రభుత్వం నష్టపోయిన రైతులను వెంటనే ఆదుకునేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. నాగల్‌గిద్ద మండల పార్టీ అధ్యక్షుడు పండరి, మాజీ ఎంపీటీసీ నందుపటేల్, అశోక్‌పటేల్, శంకర్‌పటేల్, సోపాన్‌పటేల్, వెంకట్, రాజు, ఉల్లప్ప, బాలాజీ, నాందేవ్ ఉన్నారు.

పెన్షన్ పెంపు హామీ అమలు చేయండి

మహాజన సోషలిస్ట్ పార్టీ నేత వెంకటేశ్



పటాన్‌చెరు టౌన్: ర్యాలీగా వెళ్తున్న దివ్యాంగులు

పటాన్‌చెరు టౌన్: ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం పెన్షన్లు పెంచాలని మహాజన సోషలిస్ట్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వెంకటేశ్ అన్నారు. మందకృష్ణ మాదిగ పిలుపు మేరకు ఎమ్మార్పీఎస్, వీహెచ్‌పీఎస్ నాయకులతో సోమవారం పటాన్‌చెరు తహసీల్ కార్యాలయంలో వరకు ర్యాలీ నిర్వహించి, ధర్నా చేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ప్రచారంలో భాగంగా పింఛన్లు పెంచుతామని హామీ ఇచ్చిందన్నారు. రెండేళ్లు గడుస్తున్నా హామీని అమలు చేయలేదని ఆరోపించారు.

కొండాపూర్‌లో..

కొండాపూర్(సంగారెడ్డి): కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పింఛన్‌లను పెంచాలని వికలాంగుల హక్కుల పోరాట కమిటీ జిల్లా కన్వీనర్ అశోక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవానం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో కొండాపూర్‌లోని తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు.

పింఛన్లు పెంచాలంటూ ధర్నా

జహీరాబాద్: ప్రభుత్వం పింఛన్లను పెంచాలని డిమాండ్ చేస్తూ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. సోమవారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి వినతిపత్రం అందజేశారు.

రామచంద్రాపురంలో..

రామచంద్రాపురం(పటాన్‌చెరు): పెన్షన్ పెంపును వెంటనే చేపట్టాలని డిమాండ్ చేస్తూ సోమవారం రామచంద్రాపురం మండల ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ముట్టడి కార్యక్రమం నిర్వహించారు.